# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

శనివారం | 10 మే 2025 | పేజీలు 8


## హైదరాబాద్ చందానగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం..




హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ చందానగర్ లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి చందానగర్ లోని సెంట్రో షాపింగ్ కాంప్లెక్స్ లో భారీగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు బిల్డింగ్ అంతటా వ్యాపించాయి. దీంతో కస్టమర్లు, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. హైవేపై ఉన్న అతిపెద్ద కాంప్లెక్స్ లో మంటలు వ్యాపించడంతో వాహనదారులు భయాందోళనలకు గురయ్యారు. సెంట్రో కాంప్లెక్స్ కు పక్కనే

-2 లో




## తెలంగాణ ప్రభుత్వం 'ఆపరేషన్ చేయూత' ఎఫెక్ట్...
## 38 మంది మావోయిస్టుల లొంగుబాటు

- ఛత్తీస్‌గఢ్‌లో వివిధ కేడర్లలో పనిచేసిన సభ్యులు
- లొంగిపోయినవారికి తక్షణ ఆర్థిక సహాయం అందజేత
- ఈ ఏడాది ఇప్పటివరకు 265 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడి




హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ ప్రభుత్వ కల్పిస్తున్న పునరావాస విధానాలు, శాంతియుత జీవనంపై ఆశతో, నిషేధిత సీపీఐ-మావోయిస్టు పార్టీకి చెందిన 38 మంది సభ్యులు శుక్రవారం నాడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఛత్తీస్‌గఢ్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న వీరు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎదుట ఈ 38 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు పార్టీ సభ్యులు,

-2 లో

## జనవాసాలపై డ్రోన్లతో దాడి..
## పలువురికి గాయాలు




హైదరాబాద్ పెన్ పవర్: ఉద్రిక్తల వేళ పాక్ బరితెగించింది. ఇప్పటి వరకు భారత సైనిక స్థావరాలు, ఎయిర్ పోర్టులు, ప్రార్థన మందిరాలు టార్గెట్‌గా డ్రోన్, మిసైల్ దాడులకు ప్రయత్నించిన పాక్.. తాజాగా జనవాసాలపై దాడులకు తెగబడింది. శుక్రవారం (మే 9) రాత్రి భారత్‌లోని పలు ప్రాంతాల్లో డ్రోన్లతో దాడులకు దిగింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రోన్లతో ఎటాక్ చేసింది. ఈ క్రమంలోనే పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో పాక్ జనవాసాలపై డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో ఓ కుటుంబం గాయాలపాలైంది. వెంటనే అప్రమత్తమైన అధికారులు.. డ్రోన్ దాడిలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రోన్ ఎటాక్ నేపథ్యంలో అలర్ట్ అయిన భారత సైన్యం..

-2 లో

# మళ్లీ డ్రోన్ దాడులకు తెగబడ్డ పాక్..

హైదరాబాద్ పెన్ పవర్:జమ్ము, సాంబా, పఠాన్‌కోట్?లపై పాకిస్థాన్ మరోసారి డ్రోన్ దాడులకు పాల్పడింది. పాకిస్థాన్ డ్రోన్ దాడిని భారత బలగాలు సమర్థంగా తిప్పికొట్టాయి. జమ్ము కశ్మీర్‌లోని ఉదంపూర్‌లో బ్లాకౌట్‌తో పాటు సైరన్ మోగింది.

**ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విజ్ఞప్తి**

ప్రజలెవరూ వీధుల్లోకి రావొద్దని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రజలకు సూచన చేశారు. జమ్ములో కాల్పులు, పేలుడు శబ్దాలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు."జమ్ము, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలందరికీ నా విజ్ఞప్తి. దయచేసి రాబోయే కొన్ని గంటల పాటు వీధుల్లోకి రావద్దు. మీ ఇళ్లలో లేదా సురక్షితమైన ప్రదేశాల్లో ఉండండి" అని ఒమర్ అబ్దుల్లా తన సందేశంలో పేర్కొన్నారు. సమాజంలో అనవసర ఆందోళనలు సృష్టించే వదంతులను నమ్మవద్దని, నిర్ధారణ లేని సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని ప్రజలను కోరారు. మనమంతా కలిసి ఈ పరిస్థితిని అధిగమిద్దామని ఆయన అన్నారు.

**బోర్డర్‌లో పాక్ భీకర దాడులు.. విదేశాంగ ప్రతినిధులతో ప్రధాని మోదీ అత్యవసర భేటీ**

భారత్, పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. శుక్రవారం (మే 9) రాత్రి పాక్ ఒక్కసారిగా పాక్ దాడులకు తెగబడటంతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో విదేశాంగ శాఖ ప్రతినిధులతో ప్రధాని మోదీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఢిల్లీలోని ప్రధాని మోదీ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. తాజాగా పాక్ చేస్తోన్న దాడులపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితులను ప్రధాని మోడీకి వివరించారు. సరిహద్దుల్లో జరుగుతోన్న దాడుల గురించి మోడీ ఆరా తీశారు. మరోవైపు పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాలతో సీఎంలతో ప్రధాని మోడీ ఫోన్లో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాగా, భారత్ చేతిలో చావు దెబ్బ తిన్న పాక్ మళ్లీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ యూరీ, కుప్వారా, పూంఛ్, నౌగామ్, సాంబా, తంగదార్, సెక్టర్లలోని భారత సైనిక స్థావరాలపై శుక్రవారం (మే 9) మళ్లీ కాల్పులకు తెగబడింది. ఓ వైపు కాల్పులు చేస్తూ.. మరోవైపు సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులకు ప్రయత్నించింది. సాంబా సెక్టర్, పోఖ్రాన్, ఫిరోజ్?పూర్?, పంజాబ్?లోని పఠాన్ కోట్?లో పాక్ డ్రోన్ దాడులకు పాల్పడగా.. వెంటనే అప్రమత్తమైన భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ వాటిని గాల్లోనే ధ్వంసం చేసింది. పాక్ దాడుల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా జమ్మూతో పాటు పలు ప్రాంతాల్లో మళ్లీ వార్ సైరన్లు మోగాయి. పాక్ సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు బ్లాక్ అవుట్ ప్రకటించారు. పాక్ దాడులకు భారత సైన్యం ధీటుగా బదులిస్తోంది. ఓ వైపు పాక్ ఆర్మీ కాల్పులు తిప్పికొడుతూ.. మరోవైపు గగనతల రక్షణ వ్యవస్థతో పాక్ డ్రోన్లను తునాతునకలు చేస్తోంది. దీంతో మరోసారి ఇరు దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొంది.

## తెలంగాణ ప్రభుత్వం 'ఆపరేషన్ చేయూత' ఎఫెక్ట్...
## 38 మంది మావోయిస్టుల లొంగుబాటు

- మొదటి పేజీ తరువాయి

16 మంది మిలీషియా సభ్యులు, ఏడుగురు గ్రామ కమిటీ సభ్యులు, ఆరుగురు క్రాంతికారి ఆదివాసీ మహిళా సంఘటన్ సభ్యులు, ముగ్గురు చేతన నాట్యమంచ్ సభ్యులు, నలుగురు గెరిల్లా రివల్యూషనరీ డిస్ట్రిక్ట్ సభ్యులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. లొంగిపోయిన వారికి పునరావాసం నిమిత్తం ప్రభుత్వం తరపున తక్షణ ఆర్థిక సహాయంగా చెక్కులను ఎస్పీ అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సంయుక్తంగా గిరిజన ప్రాంతాల్లో చేపడుతున్న 'ఆపరేషన్ చేయూత' వంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకున్న వీరు, మావోయిజం మార్గాన్ని వీడి, తమ కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నారని ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస సౌకర్యాలకు ఆకర్షితులై వివిధ కేడర్ల మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోతున్నారని ఎస్పీ పేర్కొన్నారు. లొంగిపోయిన వెంటనే వారికి అందాల్సిన ప్రతిఫలాలను తెలంగాణ ప్రభుత్వం తరపున పోలీసులు అందజేస్తున్నారని వారు గ్రహించారని, ఇప్పటికే లొంగిపోయిన వారు ప్రభుత్వ సౌకర్యాలను పొందుతూ తమ కుటుంబాలతో శాంతియుత జీవితం గడుపుతున్నారని వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు కొత్తగూడెం పోలీసుల ఎదుట 265 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయినట్లు ఎస్పీ వెల్లడించారు. కొంతకాలంగా నిషేధిత సీపీఐ-మావోయిస్టు పార్టీ గిరిజనుల మద్దతు, విశ్వాసం కోల్పోయిందని, వారి కాలం చెల్లిన సిద్ధాంతాలతో ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నారని ఎస్పీ ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందితే తాము మనగడ సాగించలేమని వారు భావిస్తున్నారని అన్నారు. "అమాయక గిరిజనులు జీవనోపాధి కోసం నిత్యం తిరిగే ప్రాంతాల్లో ల్యాండ్‌మైన్లు అమర్చి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మావోయిస్టు పార్టీ నాయకుల దుశ్చర్యల వల్ల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు అమాయక గిరిజనులను పోలీసు ఇన్ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు హత్య చేస్తున్నారు, హింసిస్తున్నారు" అని రోహిత్ రాజు తెలిపారు. జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడపాలనుకునే పార్టీ సభ్యులు తమ సమీపంలోని పోలీస్ స్టేషన్ లేదా జిల్లా ఉన్నతాధికారులను వారి కుటుంబ సభ్యుల ద్వారా గానీ, నేరుగా గానీ సంప్రదించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. లొంగిపోయిన పార్టీ సభ్యుల జీవనోపాధికి, పునరావాసానికి ప్రభుత్వం తరపున అన్ని రకాల ప్రయోజనాలు అందేలా జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. "తెలంగాణ ప్రాంతానికి చెందిన అగ్రశ్రేణి మావోయిస్టు నాయకులు జనజీవన స్రవంతిలో కలవాలనుకుంటే, వారికి ప్రత్యేక నగదు పురస్కారాలు, ఇతర పునరావాస సౌకర్యాలు తక్షణమే అందించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తుంది" అని ఆయన తెలిపారు.

## హైదరాబాద్ చందానగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం..

- మొదటి పేజీ తరువాయి

ఉన్న బిల్డింగ్ లకు కూడా మంటలు వ్యాపించడం కలకలం రేపింది. మంటలు భారీగా ఎగిసిపడుతున్నాయి. పక్కనే హాస్పిటల్ బిల్డింగ్ కు కూడా వ్యాపించే ప్రమాదం ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఫైర్ యాక్సిడెంట్ కారణంగా చందానగర్ %-% లింగంపల్లి హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్ ను క్లియర్ చేస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం జరిగినట్లు భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జనవాసాలపై డ్రోన్లతో దాడి..
## పలువురికి గాయాలు

- మొదటి పేజీ తరువాయి

ఫిరోజ్ పూర్ లో పూర్తిగా బ్లాక్ అవుట్ ప్రకటించింది. నగరం మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేసింది. ప్రజలు ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ఆదేశించింది. సాంబా సెక్టర్, పోఖ్రాన్, ఫిరోజ్?పూర్?, పంజాబ్?లోని పఠాన్ కోట్?, యూరీ, కుప్వారా, పూంఛ్, నౌగామ్, సాంబా, తంగదార్ సెక్టర్లలో కూడా పాక్ డ్రోన్ దాడులకు ప్రయత్నించింది. రెప్పపాటులో అలర్టైన భారత ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ పాక్ డ్రోన్లను గాల్లోనే పేల్చేశాయి. పాక్ దాడుల నేపథ్యంలో సరిహద్దుల్లోని పలు ప్రాంతాల్లో వార్ సైరన్ మోగింది. జమ్మూ, అక్నూర్, పఠాన్ కోట్, జైసల్మేర్, ఫిరోజ్?పూర్, అమృత్ సర్, అంబాలా, పంచకులాతో పాటు పలు సరిహద్దు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలో భాగంగా పూర్తిగా బ్లాక్ అవుట్ ప్రకటించారు. మరోవైపు పాక్ దాడులకు భారత సైన్యం ధీటుగా బదులిస్తోంది. పాక్ కాల్పులను తిప్పికొడుతూనే.. మరోవైపు పాక్ డ్రోన్లను ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్?తో ఎక్కడికక్కడ నేలమట్టం చేస్తోంది. అయితే.. పాక్ బరితెగించి జనవాసాలపై దాడులకు పాల్పుడుతుండటంతో ఆగ్రహానికి గురైన భారత్.. కౌంటర్ ఎటాక్ కు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ను చావు దెబ్బ కొట్టేందుకు త్రివిధ దళాలు రెడీ అవుతోన్నట్లు సమాచారం. ఈ పరిణామాల నడుమ.. ఏం క్షణాన ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ నెలకొంది.

## శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు బాంబు బెదిరింపు

హైదరాబాద్ పెన్ పవర్: ఆపరేషన్?సిందూర్ వేళ శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు బాంబు బెదిరింపు రావడం కలకలం రేపుతోంది. గుర్తు తెలియని వ్యక్తి నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో బాంబు పెట్టామంటూ అధికారులకు మెయిల్ వచ్చింది . దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎయిర్ పోర్ట్ లో తనిఖీలు చేపట్టారు. అది ఫేక్ బెదిరింపా.. లేక నిజంగానే బాంబు పెట్టారా అనే కోణంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. భారత్?%-% పాక్? ఉద్రిక్తత వేళ బాంబు బెదిరింపు ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు.

# టెరిటోరియల్ ఆర్మీని దించండి..

**ఆర్మీ చీఫ్‌కు రక్షణ శాఖ ఆదేశం..**
**సచిన్, ధోనీ బార్డర్‌కు వెళ్లాల్సిందేనా..?**






**హైదరాబాద్ పెన్ పవర్:**పహల్గాం దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ తో పాక్ టెర్రర్ క్యాంపులను లేపేసిన భారత్.. అమాయకులపై పాక్ ఆర్మీ దాడులను సీరియస్ గా తీసుకుంది. సామాన్య పౌరులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కేవలం టెర్రరిస్టుల స్థావరాలను ధ్వంసం చేసింది ఇండియా. అదే సమయంలో "ఉగ్రవాదాన్ని పెంచి పోషించడం మానుకోండి.. మేము పౌరులకు హాని కలగకుంగా ఉగ్రమూకలపైనే దాడి చేశాం.. " అని చెప్పినప్పటికీ.. పాక్ వినలేదు.

భారత్ పై దాడికి దిగేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూ దాడులకు తెరలేపింది. దీంతో భారత్ ప్రతిదాడి చేసి పాక్ లోని లాహోర్ సహా ఇతర నగరాలు, సరిహద్దు టెర్రరిస్టుల ఆవాసాలపై బాంబుల వర్షం కురిపించింది. దీంతో గత రెండు రోజులుగా ఇరు దేశాల మధ్య పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. ఈ పరిస్థితుల్లో భారత రక్షణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. సైన్యం ప్రతినిమిషం పాక్ తో పోరాడుతున్న తరుణంలో.. టెరిటోరియల్ ఆర్మీని కూడా రంగంలోకి దించేందుకు ఆదేశాలు ఇచ్చింది. యుద్ధం తీవ్రమవుతున్న వేళ అవసరమైతే టెరిటోరియల్ ఆర్మీని కూడా దించాలని ఆర్మీ చీఫ్ కు సూచించింది. టెరిటోరియల్ ఆర్మీ రూల్ 33, 1948 ప్రకారం.. టెరిటోరియల్ ఆర్మీ సహకారాన్ని తీసుకోవాలని సలహా ఇచ్చింది. ఇండియన్ ఆర్మీ అండర్ లో ఇప్పటి వరకు 32 టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్స్ ఉన్నాయి. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ, ఈశాన్య, వాయువ్య, సెంట్రల్ కమ్మాండ్స్ తో పాటు అండమాన్ నికోబార్ కమాండ్, ఆర్మీ ట్రైనింగ్ కమాండ్ అందుబాటులో ఉన్నాయి.

**టెరిటోరియల్ ఆర్మీ అంటే:**
రెగ్యులర్ ఆర్మీకి సెకండరీ ఆర్మీ ఫోర్స్ గా టెరిటోరిల్ ఆర్మీని పేర్కొంటారు. అంటే పార్ట్ టైమ్ ఆర్మీగా నమోదు చేసుకుని ఫుల్ టైమ్ ఆర్మీతో సమానంగా ట్రైనింగ్ ఇస్తారు. జీతభత్యాలు కూడా ఫుల్ టైమ్ ఆర్మీతో సమానంగా ఉంటాయి. జాతీయ అత్యవసర పరిస్థితులలో వీరు ఆర్మీకి సహకారం అందిస్తుంటారు. అంతర్గత భద్రత విషయంలో కూడా పాల్గొంటుంటారు.

**టెరిటోరియల్ ఆర్మీలో ఉన్న సెలబ్రిటీలు:**
టెరిటోరియల్ ఆర్మీలో ధోనీ, కపిల్ దేవ్ సహా పలువురు సెలబ్రిటీలు ఉన్నారు. ధోనీకి లెఫ్ట్ నెంట్ కల్నల్ (గౌరవ), 2011 పారాచూట్ రెజిమెంట్, 106 %బూ% బెటాలియన్ (పారా) హోదా ఇచ్చారు. కపిల్ దేవ్ కు లెఫ్ట్ నెంట్ కల్నల్ (గౌరవ) 2008 పంజాబ్ రెజిమెంట్ హోదా కల్పించారు. అలాగే క్రికెటర్ సచిన్, కాంగ్రెస్ లీడర్ సచిన్ పైలట్, బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ తదితరులు ఉన్నారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో టెరిటోరియల్ ఆర్మీలో ఉన్న సెలబ్రిటీలతో పాటు ఇతర సిబ్బంది యుద్ధ సన్నాహాలలో ఉన్న ఆర్మీకి తోడ్పడుతుంది. ఆర్మీ ఆదేశాల మేరకు వీరు విధుల్లోకి చేరాల్సి ఉంటుంది.

## సైన్యానికి అండగా నిలవాల్సిన సమయమిది: RSS చీఫ్ మోహన్ భగవత్ పిలుపు






**హైదరాబాద్ పెన్ పవర్:**పాకిస్థాన్ తన ఉగ్రవాద కార్యకలాపాలను కాపాడుకునేందుకు నేరుగా భారత ఆర్మీతో పాటు సరిహద్దు గ్రామాల్లోని సాధారణ పౌరులపై మిస్సైల్స్, డ్రోన్ అటాక్స్ ప్లాన్ చేస్తూ పూర్తిగా నిరాశకు గురవుతోంది. మ్నొదటి నుంచి పూర్తిగా సన్నద్ధంతో ఉన్న భారత ఆర్మీ పాక్ చర్యలను అదే స్థాయిలో తిప్పికొడుతూ భారీగా ఆస్తి నష్టంతో పాటు పాక్ ప్రభుత్వ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. ఈ చర్యలను దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు, ప్రభుత్వాలు స్వాగతిస్తున్నాయి.ఈ క్రమంలో రాష్ట్రీయ సేవా సంఘ్( %=బూ%) కూడా స్వాగతించింది. దేశంలోని పౌరులందరూ తమ దేశభక్తిని చూపించాలని సమయం ఇదేనంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రజలందరికీ పిలుపునిచ్చారు. ఈ క్రమంలో స్థానిక అధికార యంత్రాంగంతో పాటుగా సాయుధ దళాలకు తమ సహకరాన్ని అందించాలని సూచించారు. వారికి ఏ సమయంలో ఎలాంటి సహాయం కావాలన్నా ముందుకు రావాలని, దేశ ఐక్యతకు రక్షణకు తమ వంతు సహకారం ప్రజలు ఈ సమయంలో అందించాలన్నారు.

గడచిన రెండు రోజులుగా పాక్ చర్యలను అంతర్జాతీయంగా ఎండగడుతూనే మరో పక్క ఆర్మీ ధీటుగా చర్యలను కొనసాగిస్తూ ఆపరేషన్ సిందూర్ ని ముందుకు తీసుకెళ్లటాన్ని మోహన్ భగవత్ ప్రశంశించారు. పాక్ ప్రేరేపిస్తున్న ఉగ్రవాదం, వారు చేస్తున్న దాడుల్లో పహల్గామ్ బాధిత కుటుంబాలకు దీంతో న్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. పాక్ భూభాగంలో పీవోకేలోని ఉగ్రవాదుల స్థావరాలపై చేసిన దాడులను తాము పూర్తిగా సమర్థిస్తున్నామని అన్నారు

పాక్ ఆర్మీ సామాన్యులపై, ఆధ్యాత్మిక స్థలాలపై, పౌరుల నివాసాలపై చేసిన దాడుల్లో మరణించిన వ్యక్తుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి అత్యవసర సమయంలో మనమందరం జాగ్రత్తగా ఉంటూ.. సామాజిక ఐక్యత, సామరస్యాన్ని దెబ్బతీసేందుకు దేశ వ్యతిరేక శక్తులు చేసే కుట్రలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు మోహన్ భగవత్.

## ఢిల్లీలో హై అలర్ట్.. రాజధాని వ్యాప్తంగా మోగుతున్న సైరన్‌లు..







**హైదరాబాద్ పెన్ పవర్:**ఇండియా– పాక్ ఉద్రిక్తతల నడుమ దేశ రాజధాని ఢిల్లీ ఎమర్జెన్సీ పరిస్థితులకు సిద్ధమైంది. ఢిల్లీ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు అధికారులు. అత్యవసర పరిస్థితులు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పౌరులను అలర్ట్ చేసేందుకు భద్రతా దళాలు ఢిల్లీలో సైరన్ లు ఏర్పాటు చేశారు. శుక్రవారం (మే 9) రక్షణ శాఖ ఆధ్వర్యంలో అధికారులు ఢిల్లీలో సైరన్ టెస్ట నిర్వహించారు. ఐటీఓ లోని %ూఔణ% (పబ్లిక్ వర్క్స్ డిపార్ట్మెంట్) బిల్డింగ్ పై సైరన్ ను ఇన్ స్టాల్ చేసి పరీక్షించారు. మధ్యాహ్నం 3 గంటలకు సైరన్ ను 15 నుంచి 20 నిమిషాల పాటు మోగించారు. పాకిస్తాన్ మిస్సైల్స్, బాంబులు ప్రయోగించే అవకాశం ఉన్నందున రాజధాని వ్యాప్తంగా సైరన్ లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సైరన్ లను మోగిస్తారు. ఆ సమయంలో ప్రజలు బయటకు రాకుండా సురక్షిత ప్రాంతాలలో ఉండాలనే ఉద్దేశంతో సైరన్ మోగిస్తారు. భద్రతా దళాల అధికారులు సైరన్ లను ఏర్పాటు చేస్తున్న సమయంలో ఢిల్లీ మంత్రి పర్వేశ్ వర్మ కూడా సమీక్షించారు. సైరన్ పరీక్షిస్తున్నప్పుడు ప్రజలు ఆందోళనకు గురి కావద్దని ముందుగానే సందేశం పంపారు. ఢిల్లీలోని అన్ని ఎత్తైన భవనాలపై సైరన్ లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్క సైరన్ సుమారు 8 కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. శుక్రవారం రాత్రి 40 నుంచి 50 సైరన్ లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏదైన అత్యవసర పరిస్థితుల్లో సైరన్ మోగిస్తామని, వెంటనే ప్రజలు ఇళ్లల్లోకి సురక్షిత ప్రాంతాలలోకి వెళ్లి తల దాచుకోవాలని సూచించారు.

# మార్కెట్ల పతనంలోనూ జున్‌జున్‌వాలాకి లాభాలు..
# ఏకంగా రూ.890 కోట్లు గెయిన్



**హైదరాబాద్ పెన్ పవర్:**దివంగత స్టాక్ మార్కెట్ బిగ్‌బుల్ రాకేష్ జున్‌జున్‌వాలా కీర్తిని ఆయన భార్య రేఖా జున్‌జున్‌వాలా ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. అందుకే దేశీయ స్టాక్ మార్కెట్లలోని చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లు ఇప్పటికీ ఆమె పోర్ట్ ఫోలియోను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉంటారు. మార్కెట్లు లాభాల్లో ఉన్నా లేక నష్టాల్లో ఉన్నా రేఖా మాత్రం భారీగా సంపాదిస్తున్నారు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్లను భారత్ పాక్ మధ్య యుద్ధ పరిస్థితులు కమ్మేసి పతనమైనప్పటికీ రేఖా మాత్రం దూసుకుపోతున్నారు. యుద్ధ వాతావరణం మధ్య దలాల్ స్ట్రీట్ నష్టాల్లో కొట్టుమిట్టాడుతుంటే రేఖా జున్‌జున్‌వాలాకి డబ్బుల వర్షం కురుస్తోంది. ఆమెకు టాటా గ్రూప్ కంపెనీల్లో ఉన్న పెట్టుబడుల విలువ నేడు ఏకంగా రూ.892 కోట్ల మేర పెరుగుదలను చూసింది. కార్గిల్ యుద్ధం సమయంలో కూడా టాటా మోటార్స్ కంపెనీ షేర్లు లాభపడ్డాయి. అప్పట్లో స్టాక్ ఏకంగా 92 శాతం పెరుగుదలను చూసింది. ఇదే క్రమంలో టాటాలకు చెందిన మరో కంపెనీ టైటాన్ కంపెనీ షేర్లు సైతం నేడు పతనాల మార్కెట్లో కూడా లాభాలను రుచిచూసింది. దీంతో స్టాక్ దాదాపు 5 శాతం పెరుగుదలను చూసింది.

శుక్రవారం ఒక్కరోజునే టైటాన్ కంపెనీలో జున్‌జున్‌వాలాలకు ఉన్న ఇన్వెస్ట్మెంట్ విలువ రూ.15వేల 402 కోట్ల నుంచి రూ.16వేల 165 కోట్లకు పెరిగింది. అంటే కేవలం ఒక్కరోజులోనే రేఖా సంపదను టైటాన్ స్టాక్ రూ.762.69 కోట్ల మేర పెంచేసింది. ఇదే క్రమంలో టాటా మోటార్స్ కంపెనీ షేర్లు దాదాపు 4 శాతం పెరుగుదలను చూడటంతో ఆమె రూ.129.45 కోట్ల వరకు రాబడిని అందుకున్నారు. మొత్తానికి ఈ రెండు కంపెనీల నుంచే జున్‌జున్‌వాలాలకు రూ.892 కోట్ల సంపద సృష్టి నేడు ఒక్కరోజే జరగటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

దీనికి తోడు టాటా మోటార్స్ సంస్థ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు అందించిన సమాచారంలో టాటా మోటార్స్ ఫైనాన్స్ సంస్థను కూడా మెర్జ్ చేయాలని చూస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు ఇది టాటా మోటార్స్ సంస్థకు పూర్తిగా అనుబంధ సంస్థగా పనిచేస్తున్న సంగతి తెలిసిందే.

# ఆగిపోయిన ఐపీఎల్ హిస్టరీ ఇదే..




**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్ పాకిస్తాన్ యుద్ధ వాతావరణంతో ఐపీఎల్ 18 మిగతా సెషన్ ను వాయిదా వేస్తున్నట్లు బీసీసీ కీలక ప్రకటన చేసింది. ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని మిగతా మ్యాచ్ లన్నింటిని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. మే 8న ధర్మశాలలో పంజాబ్ ఢిల్లీ మ్యాచ్ అర్థాంతరంగా రద్దు చేసిన బీసీసీఐ మే 9న అత్యవసరంగా సమావేశమై తదుపరి ఐపీఎల్ మ్యాచ్ లన్నింటిని రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

**ఇంకా ఆడాల్సిన మ్యాచ్ లు**

మార్చి 22న ప్రారంభమైన ఐపీఎల్ మే 25న ముగియాల్సి ఉంది. మొత్తం 74 మ్యాచులు 65 రోజులపాటు జరగాల్సి ఉంది. మే 20న క్వాలిఫయర్ 1 (హైదరాబాద్ లో), మే 21న ఎలిమినేటర్ (హైదరాబాద్ లో )మే 23న క్వాలిఫయర్ 2 ( కోల్‌కతాలో) మే 25న ఫైనల్ ( కోల్‌కతాలో) జరగాల్సి ఉంది. అయితే భారత్ పాక్ ఉద్రిక్తత పరిస్థితుల కారణంగా ఇప్పటి వరకు అంటే మే 8(పంజాబ్ ఢిల్లీ మ్యాచ్ )తో కలిపి 58 ఐపీఎల్ మ్యాచ్ లు జరిగాయి. మిగతా 16 మ్యాచ్ లు ఎపుడు ఎక్కడ నిర్వహిస్తారనేదానిపై బీసీసీఐ త్వరలోనే స్పష్టత ఇవ్వనుంది.

**టాప్ లో గుజరాత్**

ఐపీఎల్ 18 సీజన్ లో మొత్తం 10 జట్లు పోటీ పడగా ఇప్పటి వరకు ఆడిన మ్యాచ్ లలో గుజరాత్ టైటాన్స్ జట్టు టేబుల్ లో 16 పాయింట్లతో (0.793)రన్ రేట్ తో టాప్ ప్లేస్ లో ఉంది. తర్వాత స్థానాల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 16 పాయింట్లతో రన్ రేట్ (0.482) కారణంగా రెండో ప్లేస్ లోఉంది. తర్వాత మూడో స్థానంలలో 15 పాయింట్లతో పంజాబ్, 14 పాయింట్లతో ముంబై నాల్గో స్థానంలో ఉన్నాయి.

**నాలుగు జట్లు ఎలిమినేట్**

13 పాయింట్లతో ఐదో స్థానంలో ఢిల్లీ, 11 పాయింట్లతో కోల్ కతా ఆరోస్థానం, 10 పాయింట్లతో లక్నో ఏడో స్థానంలో ఉన్నాయి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు టోర్నమెంట్ ఎలిమినేట్ అయ్యాయి.

**టాప్ స్కోరర్ గా సూర్య కుమార్ యాదవ్**

ఐపీఎల్ 18 సెషన్ లో 12 ఇన్నింగ్స్ లు ఆడిన ముంబై బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ 510 రన్స్ తో టోర్నమెంట్ టాపర్ గా ఉన్నారు. ఆ తర్వాతి స్థానాల్లో గుజరాత్ బ్యాటర్ సాయి సుదర్శన్ 509, శుభ్ మన్ గిల్ 508, ఆర్సీబీ నుంచి విరాట్ కోహ్లీ 505, గుజరాత్ బ్యాట్స్ మెన్ బట్లర్ 500 పరుగులతో ఉన్నారు.

**20 వికెట్లు తీసిన ప్రసిద్ధ కృష్ణ**

గుజరాత్ బౌలర్ ప్రసిద్ధ కృష్ణ 11 ఇన్నింగ్సుల్లో 20 వికెట్లు తీసి మొదటి స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత చెన్నై బౌలర్ నూర్ అహ్మద్ 12 ఇన్సింగ్సులు ఆడి 20 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇక ఆర్సీబీ నుంచి హాజిల్ వుడ్, ముంబై నుంచి ట్రెంట్ బౌల్ట్ చెరో 18 వికెట్లతో మూడు, నాలుగు స్థానంలో ఉన్నారు.

**అభి షేక్**

అత్యధిక వ్యక్తిగత స్కోర్ : అభిషేక్ వర్మ 144 పరుగులు (సన్ రైజర్స్)

అత్యధిక సిక్సులు: నికోలస్ పూరన్ 34 (లక్నో)అత్యధిక స్కోర్ జట్టు: 286 ( సన్ రైజర్స్)

# టర్కీకి చెందిన డ్రోన్లతో పాకిస్తాన్ దాడి: భారత్ ఎయిర్ పోర్టులను టార్గెట్ చేస్తోంది



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆపరేషన్ సిందూర్‌కు కౌంటర్‌గా గురువారం (మే 8) రాత్రి పాక్ భారత్?పై దాడులకు పాల్పడటం, పాక్ దాడులకు భారత్ కౌంటర్ ఎటాక్ ఇచ్చిన వివరాలను కేంద్ర విదేశాంగ శాఖ శుక్రవారం (మే 9) మీడియాకు వెల్లడించింది. కల్నల్ సోఫియా, వింగ్ కమాండర్ వ్యోమికా, విదేశాంగ సెక్రటరీ విక్రమ్ మిస్రీ మీడియాకు బ్రీఫింగ్ చేశారు. గురువారం (మే 8) రాత్రి భారత పశ్చిమ సరిహద్దు ప్రాంతంపై పాక్ దాడులకు దిగింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డాడులకు ప్రయత్నించింది. భారత్?లోని నాలుగు ఎయిర్ పోర్టులు లక్ష్యంగా పాకిస్థాన్ డ్రోన్లు ప్రయోగించింది. లేహ్ నుంచి సర్ క్రీక్ వరకు మొత్తం 36 చోట్ల దాడులకు పాల్పడింది. కైనటిక్, నాన్ కైనటిక్ సాధనాలతో పాక్ దాడులను భారత్ తిప్పికొట్టింది. పాక్ ప్రయోగించిన డ్రోన్లను కూల్చివేశాం. ప్రస్తుతం ఆ డ్రోన్ల పరిశీలన జరుగుతోంది. అవి టర్కీకి చెందిన డ్రోన్లుగా గుర్తించాం. భటిండా సైనిక స్థావరంపై దాడికి ప్రయత్నం జరిగింది. కశ్మీర్ లోని తంగ్ధర్, యూరీలో పాక్ దాడులకు తెగబడింది. పాక్ దాడులకు కౌంటర్ భారత్ ప్రతి దాడులు చేసింది. భారత్ చేసిన కౌంటర్ ఎటాక్ లో పాక్ కు తీవ్ర నష్టం వాటిల్లింది. పౌరవిమానాలను కవచంగా ఉపయోగించుకుని పాక్ దాడులకు పాల్పడుతోంది. ఎల్వోసీ వెంబటి పాక్ పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోంది. బోర్డర్లో భారీ ఆర్టిలరీలతో పాక్ కాల్పులు జరుపుతోంది. పాక్ యుద్ధ విమానాలు పరిధి ధాటి భారత్ లోకి ప్రవేశించగా వాటిని కూల్చేశామని వెల్లడించారు.

# ఇండియన్ ఆర్మీకి విరాళం ప్రకటించిన నిర్మాత అల్లు అరవింద్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రస్తుత భారత్-పాకిస్థాన్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ భారత సైనిక దళాలకు తమ మద్దతును ప్రకటించారు. తమ నిర్మాణ సంస్థ ద్వారా ఇటీవల విడుదలైన 'చసింగిల్' చిత్రం ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత మొత్తాన్ని సైనికుల సంక్షేమానికి విరాళంగా అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో 'చసింగిల్' సినిమా సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్ ఈ ప్రకటన చేశారు. దేశ సరిహద్దుల్లో సైనికులు అప్రమత్తంగా ఉంటూ, దేశ రక్షణ కోసం పోరాడుతున్న సమయంలో తాము సినిమా విజయోత్సవ సంబరాలు చేసుకోవడం సముచితం కాదని భావించినట్లు ఆయన తెలిపారు. కేవలం సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ ప్రెస్ మీట్‌ను ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, "దేశం కోసం మన సైనికులు పోరాడుతుంటే, మేం ఇక్కడ వేడుకలు చేసుకోవడం సరికాదనిపించింది. వాస్తవానికి, ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులు తలెత్తక ముందే మా సినిమా విడుదల తేదీని ఖరారు చేశాం. తర్వాత సినిమా విడుదలను వాయిదా వేయాలా, వద్దా అనే అంశంపై కూడా చర్చించాం. అయితే, ఒక సినిమా నిర్మాణం వెనుక వందలాది మంది సాంకేతిక నిపుణులు, కార్మికుల శ్రమ ఉంటుంది. అలాగే, థియేటర్ల మీద ఆధారపడి అనేక కుటుంబాలు జీవిస్తుంటాయి.

# ఏప్రిల్ ఫూల్స్ కాని ఇన్వెస్టర్లు.. గత నెలలో తెలివిగా వ్యవహరించారుగా..





**హైదరాబాద్ పెన్ పవర్:**కొన్ని నెలలుగా దేశీయ స్టాక్ మార్కెట్లలోకి రిటైల్ పెట్టుబడిదారులు పార్టిసిపేషన్ మారుతూ వస్తోంది. బుల్ ర్యాలీ కొనసాగినప్పుడు మ్యూచువల్ ఫండ్స్ రూపంలో ఈక్విటీల్లోకి భారీగా డబ్బును కుమ్మరించిన ఇన్వెస్టర్లు ఆ తర్వాత తమ ఎస్ఐపీలను క్రమంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే చాలా మంది నిపుణులు మాత్రం ఇది సరైన నిర్ణయం కాదని, మార్కెట్ల పతనాన్ని లాభాలుగా మార్చుకునేందుకు ఉపయోగించుకోవాలని చాలా సార్లు చెబుతూనే వచ్చిన సంగతి తెలిసిందే.

అయితే ఏప్రిల్ నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడిదొడుకులకు గురైనప్పటికీ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్లు మాత్రం తమ ఎస్ఐపీలను తిరిగి షురూ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఎస్ఐపీల సంఖ్య ఏప్రిల్ నెలలో 3 శాతం పెరిగి రూ.26వేల 632 కోట్లకు చేరుకున్నాయి. అయితే వీటి విలువ మార్చి మాసంలో రూ.25వేల 962 కోట్లుగా ఉంది. అలాగే ఏప్రిల్ మాసంలో మొత్తం ఫోలియోల సంఖ్య స్వల్పంగా పెరిగి 23కోట్ల 62లక్షల 95వేల 024కి చేరుకున్నాయి. ఈ క్రమంలో రిటైల్ మ్యూచువల్ ఫండ్ ఫోలియోల సంఖ్య కూడా పెరుగుదలను చూసింది. మొత్తానికి ఏప్రిల్ మాసంలో రిటైల్ అసెట్స్ అండర్ మేనేజ్మెంట్ రూ.40లక్షల 29వేల 311 కోట్లకు పెరిగింది. ఈ క్రమంలో కొత్తగా ఎస్ఐపీ పెట్టుబడులు చేసేందుకు రిజిస్ట్రేషన్ల సంఖ్య 46 లక్షల మేర పెరుగుదలను చూసింది. ఏప్రిల్ నెలలో ఎస్ఐపీల విలువ సరికొత్త గరిష్ఠాలను తాకటం గమనార్హం. ప్రజల్లో పెట్టుబడులపై అవగాహన పెరగటంతో పాటు చిన్న మొత్తాల్లో ఎస్ఐపీలను స్టార్ట్ చేసేందుకు అనేక ఏఎంసీలు వెసులుబాటు కల్పించటం కీలకంగా మారిందని నిపుణులు చెబుతున్నారు.

ప్రస్తుతం ఇండియా పాక్ మధ్య ఉద్రిక్తతలతో పాటు ప్రపంచ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెట్టుబడులను స్వల్ప కాలంలో ప్రభావితం చేసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ సమయాల్లో కూడా సరైనా ఎంపికల ద్వారా పెట్టుబడులను ముందుకు తీసుకెళ్లే ఇన్వెస్టర్లు భవిష్యత్తులో పరిస్థితులు చక్కబడిన తర్వాత ఉత్తమ రాబడులను చూస్తారని వారు చెబుతున్నారు.

## బోర్డర్లో ఉన్నా, చిక్కుకున్నా.. ఈ ఫోన్ నెంబర్లకు కాల్ చేయండి:

# తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమైన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంతర్జాతీయ సరిహద్దులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, సరిహద్దు రాష్ట్రాలలో ప్రస్తుతం నివసిస్తున్న లేదా చిక్కుకున్న తెలంగాణ వాసులకు సకాలంలో సహాయం, సమాచారం, సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. నిరంతరాయంగా సేవలను నిర్ధారించడానికి ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలు పని చేయనుంది. ఈ మేరకు సంబంధిత ఆఫీసర్ల నెంబర్లను వెల్లడించింది. ఈ నెంబర్లను సంప్రదించవచ్చని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.గౌరవ్ ఉప్పల్ తెలిపారు.

**సంప్రదించాల్సిన కంట్రోల్ రూమ్ నెంబర్లు:**

ఢిల్లీలోని తెలంగాణ భవన్ ల్యాండ్‌లైన్: 011-23380556

వందన, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ & లైజన్ హెడ్ - 9871999044

హైదర్ అలీ నఖ్వీ, రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు - 9971387500

జి. రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ - 9643723157

సిహెచ్. చక్రవర్తి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్- 9949351270.

## మిస్ వరల్డ్ పోటీలకు భద్రత కట్టుదిట్టం.. మే10న గచ్చిబౌలి స్టేడియంలో ఓపెనింగ్ సెర్మనీ




**హైదరాబాద్ పెన్ పవర్:**మిస్ వరల్డ్ పోటీలు.. ప్రపంచం అంతా చూసే ఈవెంట్.. ప్రపంచ సుందరీమణులతో పాటు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొనే ప్రతిష్టాత్మక పోటీలు. అలాంటి ఈవెంట్ ను తెలంగాణ ప్రభుత్వం ఎంతో ఛాలెంజింగ్ తో నిర్వహిస్తోంది. ఒకవైపు ఇండియా - పాకిస్తాన్ యుద్ధ వాతావరణంలో ఇప్పటికే ఐపీఎల్ ను వారం పాటు వాయిదా వేసింది బీసీసీఐ. దేశ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో మిస్ వరల్డ్-2025 పోటీలను కట్టుదిట్టమైన భద్రతల నడుమ నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాతీసుకున్న మిస్ వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు మాదాపూర్ డీసీపీ వినీత్ తెలిపారు. రేపు (శనివారం, మే 10) గచ్చిబౌలి స్టేడియం లో గ్రాండ్ ఓపెనింగ్ సెర్మనీ ఉన్నందున.. ఈ కార్యక్రమనికి టూరిజం శాఖ పాస్ లు ఉన్న వారికే అనుమతి ఉంటుందని ఆయన చెప్పారు. ఈవెంట్ కు సంబంధించి ప్రెస్ మీట్ లో డీసీపీ వినీత్ మాట్లాడారు. "స్టేడియం లో జరిగే ఈవెంట్ కు 300 నుండి 350 మంది పోలీసులు బందబాస్త్ లో ఉంటారు. ఇప్పటి వరకు 103 మంది కంటెస్టెంట్స్ వచ్చినట్లు సమాచారం ఉంది. దేశ సరిహద్దులో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని టైట్ సెక్యూరిటి ఏర్పాటు చేశాము. గచ్చిబౌలి స్టేడియం, కంటెస్టెంట్స్ బస చేసే హెూటల్స్ వద్ద భద్రత కట్టుదిట్టం చేశాము. భద్రతకు సంబంధించి తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ సీపీ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు" అని తెలిపారు. ఈవెంట్ నిర్వహిస్తున్న ఏరియాలో భారీ బందోబస్తు ఉంటుందని చెప్పారు. మాదాపూర్ పరిధిలో మొత్తం 500 మంది బందోబస్తులో ఉంటారని అన్నారు. మాదాపూర్ జోన్ పరిధిలో కమ్యూనియల్ క్రిమినల్ హిస్టరీ ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టినట్లు చెప్పారు. విదేశాల నుండి వచ్చిన కంటెస్టెంట్స్ ప్రయాణించే రూట్స్ మొత్తం ట్రాఫిక్, లా ఎండ్ ఆర్డర్ పోలీసులు కో ఆర్డినెట్ చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత పరంగా అన్ని చర్యలు తీసుకున్నామని ప్రెస్ మీట్ సందర్భంగా చెప్పారు.

## భారత్ - పాక్ ఉద్రిక్తతల నడుమ.. మిస్ వరల్డ్ పోటీలు కొనసాగుతాయా?

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ - పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో మిస్ వరల్డ్ పోటీలు ఉంటాయా..? వాయిదా పడతాయా..? అన్న సస్పెన్స్ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా ఇవాళ మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా, చెక్ రిపబ్లిక్, శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోగా.. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. వీళ్లంతా బస చేసే ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వాహక సంస్థ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోటీలపై తర్జన భర్జన పడుతున్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ఆయా దేశాల నుంచి వచ్చిన వారందరి భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో మిస్ వరల్డ్ పోటీలకు మూడు వారాలపాటు పూర్తిస్థాయి భద్రత పెద్ద సవాలని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అభిప్రాయం ప్రకారం నడుచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని తెలుస్తోంది.

## కంగారు పడకండిరా బాబు.. పెట్రోల్-గ్యాస్ షార్టేజీపై ఆయిల్ కంపెనీల క్లారిటీ




**హైదరాబాద్ పెన్ పవర్:** సరిహద్దుల్లో యుద్ధం దాయాది దేశంతో రోజురోజుకూ ముదురుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇప్పటికే చాలా చోట్ల ప్రజలు అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నగదును నిల్వ చేసుకోవటంతో పాటు కొన్ని వారాలకు సరిపడా నిత్యావసరాలను కూడా స్టాక్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే చాలా మందిలో ఇంధన నిల్వలపై ఆందోళనలు పెరిగిపోతున్నాయి. ప్రజల్లో ఒక్కసారిగా ఇంధనం, గ్యాస్ వంటి వాటిపై ఆందోళనలు పెరగటంపై భారత ప్రభుత్వ యాజమాన్యంలోని ఆయిల్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా అనుమానాలను క్లియర్ చేసింది. తమ వద్ద అవసరాలకు మించిన స్థాయిలో ఇంధన నిల్వలు ఉన్నాయని, అలాగే తమకు ఆయిల్ సరఫరా మార్గాలు ఇబ్బందులు లేకుంగా పూర్తిగా సాఫీగా కొనసాగుతున్నాయని వెల్లడించింది. ఎక్కడా ఎలాంటి షార్టేజీలు లేవని హామీ ఇచ్చింది.

ప్రజలు ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల్లో ఇంధనం గురించి, గ్యాస్ నిల్వల గురించి అస్సలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించింది. దేశవ్యాప్తంగా తన ఔట్ లెట్లలో స్టాక్ ఎప్పటికప్పుడు సరఫరా జరుగుతోందని అనవసరమైన అనుమానాలను మానుకోవాలని విజ్ఞప్తి చేసింది. ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు తమ ఔట్ లెట్ల వద్ద సిబ్బందికి సహకరించాలని సూచించింది. దేశవ్యాప్తంగా రవాణా వ్యవస్థలు, ప్రజల వినియోగానికి అవసరమైన స్థాయిలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిరంతరం సరఫరా చేసేందుకు తాము పూర్తి ఏర్పాట్లు చేశామని, అందువల్ల వీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది తలెత్తదని హామీ ఇస్తూ ప్రజల్లో అనవరమైన భయాలను తొలగించే ప్రయత్నం చేసింది.

## డిఫెన్స్ కంపెనీలకు దిల్లీ పెద్దల నుంచి కాల్స్.. దూసుకుపోతున్న ఆ కంపెనీల స్టాక్స్..

**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు రోజులుగా భారత్ పాక్ సరిహద్దుల్లో డ్రోన్లు, మిసైల్స్ దాడులు భారీగా పెరిగిపోయాయి. ప్రధానంగా క్షిపణులతో పాటు దాడులు చేసేందుకు అత్యాధునిక డ్రోన్ల వినియోగం సాయుధ దళాలకు విజయాన్ని తెచ్చిపెడుతున్న వేళ ఈ రంగాల్లోని కంపెనీ షేర్లకు మార్కెట్లో భారీగా డిమాండ్ కనిపిస్తోంది. ఇదే క్రమంలో యుద్ధ సన్నద్ధతలో భాగంగా దిల్లీకి రావాలంటూ ప్రముఖ మందుగుండు తయారీ సంస్థలకు పిలుపు రావటం సదరు కంపెనీ షేర్లను రాకెట్ వేగంతో దూసుకుపోయేలా చేస్తోంది. తాజాగా భారత ప్రభుత్వం దేశంలోని రక్షణ పరికరాలు, మందుగుండు సామాగ్రి తయారీ సంస్థలను దిల్లీకి రావాలని పిలిచినట్లు భారత్ ఫోర్జ్ లిమిటెడ్ చైర్మన్, సీఎండీ బాబాసాహెబ్ నీలకాంత్ కళ్యాణి పేర్కొన్నారు. వచ్చేవారం దీనికి సంబంధించిన ఆహ్వానం అందినట్లు తెలిపారు. గడచిన రెండు రోజుల్లో రక్షణ రంగంలోని అనేక కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.40వేల కోట్ల లాభపడ్డాయి. పాక్ తన కవ్వింపు చర్యల్లో భాగంగా సరిహద్దుల్లోని అనేక నగరాలపై చేస్తున్న డ్రోన్, క్షిపణి దాడులను ఎదుర్కోవటంలో పూర్తిగా స్వదేశంలో తయారు చేయబడిన ఆకాశ్ క్షిపణి వ్యవస్థను భారత సాయుధ దళాలు విజయవంతంగా వినియోగించటం గమనార్హం. వాస్తవానికి దీనిని భారత్ డైనమిక్స్ సంస్థతో పాటు డీఆర్డీఓ సంయుక్తంగా రూపొందించాయి. ఇది యుద్ధ విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, డ్రోన్లను భూమిపై నుంచే గాలిలో నిర్వీర్యం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి.

# శాటిలైట్ ఇంటర్నెట్ స్పెక్ట్రమ్ ధరలు..సబ్స్క్రైబర్‌కు రూ.500, ఆపరేటర్లకు 4 శాతం లెవీ.. ఇక జెట్ స్పీడ్ ఇంటర్నెట్




**హైదరాబాద్ పెన్ పవర్:** శాటిలైట్ ఆధారిత ఇంటర్నెట్ సేవలకు సంబంధించి స్పెక్ట్రమ్ ధరలపై టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సిఫారసులను ప్రకటించింది. ఎలాన్ మస్క్ తో సహా ఇండియాలో శాటిలైట్ సేవలు అందించాలనుకుంటే ట్రాయ్ నిబంధనలు పాటించాల్సిందేనని పేర్కొంది. శాటిలైట్ ఇంటర్నెట్ అందించేందుకు ఆపరేటర్లు చెల్లించాల్సిన ఛార్జీలను ప్రకటించింది.

ఇండియాలో ఇంటర్నెట్ సర్వీసెస్ అందించేందుకు ఎలోన్ మస్క్ స్టార్‌లింక్‌తో సహా ఆపరేటర్లు ఆదాయంలో 4 శాతం లెవీ చెల్లించాలని ట్రాయ్ సూచించింది. అయితే పట్టణ ప్రాంతాల్లో సేవలను అందించే వారు ప్రతి చందాదారునిపై ఏటా అదనంగా రూ. 500 చెల్లించాలని తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో సేవలకు అదనపు ఛార్జీ ఉండదు. శాటిలైట్ (ఉపగ్రహ) బ్రాడ్‌బ్యాండ్ కోసం స్పెక్ట్రమ్‌ను ఐదు సంవత్సరాలకు కేటాయించాలని, ఒకవేళ కొనసాగించాల్సి వస్తే మరో రెండేళ్లు పొడిగించవచ్చునని ప్రతిపాదించింది. రెవెన్యూ ఆధారంగా 4 శాతం ఛార్జ్, జియోస్టేషనరీ ఆర్బిట్ (GSO) , నాన్-జియోస్టేషనరీ ఆర్బిట్ (NGSO) ఆపరేటర్లకు ఇద్దరికీ వర్తిస్తుందని తెలిపింది. సంవత్సరానికి కనీస స్పెక్ట్రమ్ ఫీజుMHzకి రూ. 3,500 గా ప్రతిపాదించింది.

టెలికాం మౌలిక సదుపాయాలు లేని వెనుకబడిన ప్రాంతాలలో కనెక్టివిటీని మెరుగుపరచడంలో శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు కీలక పాత్ర పోషిస్తాయని TRAI చైర్మన్ అనిల్ కుమార్ లాహోటి ఈ సందర్భంగా తెలిపారు. విపత్తు నిర్వహణ, సహాయ కార్యకలాపాలకు కూడా ఇవి చాలా అవసరమని ఆయన అన్నారు.

ఇండియాలో ఇంటర్నెట్ సేవలు అందించేందుకు స్టార్‌లింక్ ఈ వారం లెటర్ ఆఫ్ ఇంటెంట్ (%ూశీ×%) అందుకుంది. కార్యకలాపాలను ప్రారంభించే ముందు లైసెన్స్ పొందాలి. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఏరోస్పేస్ సంస్థ స్పేస్‌ఎక్స్, ఇండియాలో స్టార్‌లింక్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధం చేసింది.

అందుకోసం కీలక పోటీదారులు రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్‌లతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. జియో, ఎయిర్ టెల్ కంపెనీలు తమ నెట్‌వర్క్‌ల ద్వారా స్టార్‌లింక్ పరికరాలను పంపిణీ చేయడమే కాకుండా కస్టమర్ సెటప్, యాక్టివేషన్‌కు చేస్తాయి.

# ఉద్రిక్తతల సమయంలో ఆటవిడుపు... సాంబ రిలీఫ్ క్యాంప్ లో క్రికెట్ ఆడిన సీఎం ఒమర్ అబ్దుల్లా

**జమ్మూకశ్మీర్ లోని సరిహద్దు ప్రాంతాల్లో సహాయక శిబిరాల ఏర్పాటు**

**సాంబ శిబిరం వద్ద బాలుడితో క్రికెట్ ఆడిన ఒమర్ అబ్దుల్లా**

**శిబిరాల్లో ఆహారం, వైద్యం అందిస్తున్నామన్న సీఎం**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాకిస్థాన్ మధ్య సరిహద్దుల్లో ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. నిన్న రాత్రి ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్త వాతావరణం నేపథ్యంలో... పాకిస్థాన్ షెల్లింగ్ కారణంగా నష్టపోయిన జమ్మూకశ్మీర్‌లోని సరిహద్దు ప్రాంతాల పౌరుల కోసం అక్కడి ప్రభుత్వం సహాయక శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సాంబలోని సహాయక శిబిరంలో పర్యటించి, అక్కడ ఓ చిన్నారితో క్రికెట్ ఆడుతూ కొంత రిలాక్స్ అయ్యారు. బాధితులకు ధైర్యం చెబుతూ, ప్రభుత్వ అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు.

సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సహాయక శిబిరాల గురించి విలేకరులతో మాట్లాడుతూ, శిబిరాల్లో ఉంటున్నంత కాలం పౌరులు తక్కువ సమస్యలను ఎదుర్కొనేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఒమర్ అబ్దుల్లా తెలిపారు.

“మేము చేయగలిగినదంతా చేస్తున్నాం. రోజుకు మూడు పూటలా ఆహారం అందిస్తున్నాం, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి, అన్ని శిబిరాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేశాం... ఇక్కడ ఉండటం వల్ల వారు సాధ్యమైనంత తక్కువ సమస్యలను ఎదుర్కొనేలా చూస్తున్నాం” అని ఆయన వివరించారు. అంతకుముందు, పూంచ్‌లో జరిగిన పాకిస్థాన్ షెల్లింగ్‌లో గాయపడిన వారిని పరామర్శించేందుకు ముఖ్యమంత్రి జమ్మూలోని ప్రభుత్వ ఆసుపత్రికి కూడా వెళ్లారు.

# బీఓబీ భారీ నోటిఫికేషన్.. పదో తరగతితో 500 పోస్టుల భర్తీ.. పూర్తి డీటైల్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్? బరోడా ఆఫీస్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా బ్యాంకు శాఖల్లో ఖాళీగా ఉన్న 500 పోస్టులను భర్తీ చేయనున్నది. పదో తరగతి విద్యార్హతతో భర్తీ చేయనున్న ఆఫీస్ అసిస్టెంట్ పోస్టు ఎగ్జామ్ ప్యాటర్న్, సిలబస్, సెలెక్షన్ ప్రాసెస్ గురించి తెలుసుకుందాం.

**పోస్టుల సంఖ్య:**
500 (ఆఫీస్ అసిస్టెంట్/ ప్యూన్)(ఎస్సీ 65, ఎస్టీ 33, ఓబీసీ 108, ఈడబ్ల్యూఎస్ 42, అన్ రిజర్వ్?డ్ 252, ఎక్స్ సర్వీస్?మెన్ 97, ఎక్స్ సర్వీస్?మెన్ డిసేబుల్? 12, పీడబ్ల్యూబీడీ 9. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం13 పోస్టులు ఉన్నాయి. ఎస్సీ 2, ఓబీసీ 3, ఈడబ్ల్యూఎస్ 1, అన్ రిజర్వ్?డ్ 7, ఎక్స్ సర్వీస్?మెన్ 3 ఉన్నాయి.

**వయోపరిమితి:**
కనిష్ట వయోపరిమితి 18 ఏండ్లు. గరిష్ట వయోపరిమితి 26 ఏండ్లు.(1999, మే 1 నుంచి 2007, మే 1 మధ్యలో జన్మించిన వారై ఉండాలి.) ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పర్సన్స్ విత్ బెంచ్ మార్క్ డిసేబులిటీస్?కు 10 ఏండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఎక్స్ సర్వీస్‌మెన్‌కు అదనంగా మూడేండ్లు, డిసేబుల్ ఎక్స్ సర్వీస్‌మెన్‌కు వయోపరిమితిలో ఎనిమిది ఏండ్లు సడలింపు




ఉంటుంది. వితంతు, విడాకులు తీసుకున్న మహిళలు, న్యాయబద్ధంగా విడాకులు తీసుకుని మళ్లీ వివాహం చేసుకోని మహిళలకు జనరల్ అయితే 35 ఏండ్లు, ఓబీసీలు అయితే 38 ఏండ్లు, ఎస్సీ, ఎస్టీలకు 40 ఏండ్లు.

**ఎలిజిబిలిటీ:**
పదో తరగతి లేదా మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఏ రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతంలో ఉద్యోగం కోసమైతే అప్లికేషన్ సమర్పిస్తున్నారో ఆ రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంతానికి చెందిన స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంత స్థానిక భాషలో మాట్లాడటం, రాయడం, చదవడం రావాలి.

**అప్లికేషన్లు ప్రారంభం: మే 3.**

**అప్లికేషన్ ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఎక్స్ సర్వీస్?మెన్, మహిళా అభ్యర్థులకు రూ.100.

**అప్లికేషన్ లాస్ట్ డేట్: మే 23.**

**సెలెక్షన్ ప్రాసెస్:** ఆన్?లైన్ టెస్ట్, స్థానిక భాషలో ప్రావీణ్య పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. ఏ అభ్యర్థి అయితే ఆన్?లైన్ టెస్టులో క్వాలిఫై లేదా ఉత్తీర్ణత సాధిస్తారో వారికి మాత్రమే స్థానిక భాష ప్రావీణ్య టెస్ట్ ఉంటుంది.

**ఆన్‌లైన్ టెస్ట్**
మొత్తం 100 మార్కులకు ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. నాలెడ్జ్ ఆఫ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ (25 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ (25 మార్కులు), ఎలిమెంటరీ అర్థమెటిక్ (25 మార్కులు), సైకోమెట్రిక్ టెస్ట్(రీజనింగ్)(25 మార్కులు) నుంచి ప్రశ్నలు ఉంటాయి. 80 నిమిషాల్లో సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతి తప్పుడు సమాధానానికి 0.25 మార్కులు కోత విధిస్తారు. అయితే, ఎలాంటి జవాబు గుర్తించకుండా వదిలివేసిన ప్రశ్నకు నెగెటివ్ మార్కింగ్ ఉండదు. ప్రతి అభ్యర్థి ఆన్?లైన్ టెస్టులో ప్రతి విభాగంలో కనీస మార్కులు సాధించాల్సి ఉంటుంది. స్థానిక భాషా ప్రావీణ్య టెస్టుకు అర్హత సాధించడానికి మొత్తం 100 మార్కులకు కట్%-%ఆఫ్? మార్కులు సాధించడం తప్పనిసరి. పరీక్ష ఇంగ్లీష్?/ హిందీ/ సంబంధిత రాష్ట్రం/ కేంద్రపాలిత ప్రాంత అధికారిక భాషలో ఉంటుంది.

**ప్రొబేషన్**
ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థికి విధుల్లో చేరిన తేదీ నుంచి ఆరు నెలలు ప్రొబేషన్ సమయం ఉంటుంది. విజయవంతంగా ప్రొబేషన్ పూర్తి చేసిన వారిని శాశ్వత ప్రాతిపదికన నియమిస్తారు.

# అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు: మంత్రి పొంగులేటి






**హైదరాబాద్ పెన్ పవర్:**అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ నెలాఖరులోగా ప్రెస్? అకాడమీ భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇవాళ నాంపల్లి ప్రెస్? అకాడమీ కార్యాలయంలో వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన జర్నలిస్టులకు, వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతస్తామన్నారు. విడతల వారీగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42 కోట్లను ఫిక్సడ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు చేస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్?డిపాజిట్ పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదన్నారు. తమ ప్రాణాలను లెక్క చేయకుండా జర్నలిస్టులు సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారని తెలిపారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ .. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.నల్గొండ జిల్లా నకిరేకల్?లో ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు . ఈ మేరకు విద్యార్థులు, పోలీసులతో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రభుత్వ ఆసుపత్రి నుండి మెయిన్ సెంటర్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్?కుమార్?రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేలు, ఎమ్మెల్సీలు నెలికంటి సత్యం, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ తదిరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో హై అలర్ట్.. భద్రత కట్టుదిట్టం
# చేయాలని పోలీసులకు ఆదేశం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాక్ ఉద్రిక్తతల వేళ హైదరాబాద్?లోని శంషాబాద్ ఎయిర్ పోర్ట్?కు బాంబ్ బెదిరింపు కాల్ తీవ్ర కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తి నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్?లో బాంబు పెట్టామంటూ అధికారులకు మెయిల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరగనున్న నేపథ్యంలో విదేశాల నుంచి పోటీదారులు వస్తుండటం.. మరోవైపు ఆపరేషన్ సిందూర్ తో ఉద్రిక్తత నెలకొనడంతో.. ముందస్తు చర్యల్లో భాగంగా హైదరాబాద్‌లో హై అలర్ట్ ప్రకటించారు. పోలీస్ యంత్రాంగం సిటీలో ఎక్కడికక్కడ నిఘా పెంచింది. నగరంలో జనసామర్థ్య ప్రదేశాలైన ఎల్బీ నగర్, వనస్థలిపురంలో రాచకొండ డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ముమ్మర తనిఖీలు చేపట్టింది. చాలా కాలంగా ఒకే చోట పార్క్ చేసిన వెహికల్స్.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన బస్సుల్లో సోదాలు చేపట్టారు. అనుమానస్పదంగా కనిపిస్తే అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

శనివారం (మే 10) నుంచి హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులతో హైలెవల్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. మిస్ వరల్డ్ పోటీలకు భారీ సెక్యూరిటీ కల్పించాలని ఆదేశించారు. మిస్ వరల్డ్ పోటీదారులు విడిది చేసే కేంద్రాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు.

## పాకిస్తాన్‌తో యుద్ధాన్ని ప్రకటించేది ఎవరు..? ప్రధానినా.. రాష్ట్రపతినా..? :

# 1971లో ఎలా ప్రకటించారు..?




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్తాన్ దేశంతో ఇండియా ఇప్పుడు యుద్ధం చేస్తుందా లేక యుద్ధ సన్నాహాలు చేస్తుందా.. అసలు ప్రస్తుతం జరుగుతున్న దానిని యుద్ధం అని భారత ప్రభుత్వం ప్రకటించిందా లేక పాకిస్తాన్ దేశంతో యుద్ధం చేస్తున్నాం అని ఎవరు చెప్పాలి.. ఎవరు ప్రకటిస్తారనే ప్రశ్నలు ప్రతి భారతీ పౌరుడి మనస్సులో కొనసాగుతున్నాయి. గడచిన 3 రోజులుగా ఇండియా, పాకిస్తాన్ మధ్య జరుగుతున్నది యుద్ధం కాదా.. కేవలం దాడులు మాత్రమేనా.. ఇలాంటి ఎన్నో సందేహాలకు సమాధానమే ఈ ప్రత్యేక కథనం.. ఒకదేశం మరో దేశంతో యుద్ధానికి దిగాలి అనుకున్నప్పుడు దానికి ఒక ప్రక్రియ ఉంటుంది. అయితే భారతదేశం యుద్ధం విషయంలో ఎలాంటి ప్రక్రియను ఫాలో అవుతుందనే విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం. భారతదేశంలో యుద్ధాన్ని ప్రకటించే పవర్స్ ప్రెసిడెంట్ వద్ద ఉంటాయి. అయితే ముందుగా కేంద్ర మంత్రులతో ప్రధాని కేబినెట్ సమావేశం నిర్వహించిన తర్వాత మాత్రమే నిర్ణయం తీసుకోబడుతుంది. రాజ్యాంగంలో ప్రత్యేకంగా యుద్ధానికి సంబంధించి ప్రక్రియను పొందుపరచలేదు. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 కింద జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించడం అనేది యుద్ధం లాంటి పరిస్థితికి సంబంధించినదిగా రాజ్యాంగంలో ఉంది. భారతదేశంలోని త్రివిధ దళాలకు రాష్ట్రపతి సుప్రీం కమాండర్. అయితే యుద్ధానికి వెళ్లాలా లేక శాంతియుతంగా ముందుకు సాగాలా అనే నిర్ణయాన్ని రాష్ట్రపతి ప్రభుత్వంతో చర్చల తర్వాత నిర్ణయిస్తారు. ఆర్టికల్ 53 ఈ విషయంలో పూర్తి స్వేచ్ఛ రాష్ట్రపతి కలిగి ఉంటారని చెబుతోంది. అలాగే ఆర్టికల్ 74లో కేబినెట్ మంత్రులతో నిర్ణయానికి ముందు సంప్రదింపులు జరిపి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించబడింది. యుద్ధానికి వెళ్లాలా వద్దా అనే విషయంలో కేబినెట్ చాలా కీలకంగా వ్యవహరించనుంది. ప్రధాని నేతృత్వంలో రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ నుంచి మంత్రులకు కీలకమైన సూచనలు అందుతాయి. అయితే చివరికి నిర్ణయం తీసుకోవటానికి ముందు మిలిటరీ చీఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీల నుంచి కూడా సమాచారం సేకరించబడుతుంది. 44వ సవరణ చట్టం 1978 ప్రకారం, రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించవచ్చు. అయితే ఇది కేబినెట్ నుండి వ్రాతపూర్వక సిఫార్సు ఆధారంగా మాత్రమే వర్తిస్తుంది. పార్లమెంటు రాజ్యాంగబద్ధంగా యుద్ధాన్ని ప్రకటించడానికి బాధ్యత వహించనప్పటికీ.. పర్యవేక్షణతో పాటు నిధులను సమకూర్చటం వంటి విషయాల్లో కీలక పాత్ర నిర్వహిస్తుంది. ఈ క్రమంలో రక్షణ బడ్జెట్ పర్యవేక్షించటం, సైన్యం చేపడుతున్న చర్యలపై చర్చించటం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా మార్చటం వంటివి ఉంటాయి. అయితే దీర్ఘకాలం పాటు అనిశ్చితులు కొనసాగిన సమయంలో ప్రభుత్వం పార్లమెంటుకు సమాచారం అందించి రాజకీయ ఏకాభిప్రాయాన్ని కోరుతుంది. ఒకవేళ యుద్ధానికి వెళ్లే ప్రక్రియను గమనిస్తే.. కేంద్ర కేబినెట్ పరిస్థితులను పరిశీలించిన తర్వాత వ్రాతపూర్వకంగా యుద్ధానికి వెళ్లటం గురించి రాష్ట్రపతికి సిఫార్సు చేస్తుంది. ఆ తర్వాత దానికి అనుగుణంగా రాష్ట్రపతి ఆర్టికల్ 352 కింద నేషనల్ ఎమర్జెన్సీని ప్రకటిస్తారు. అయితే ఇది పూర్తి దేశానికి లేదా దేశంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే వర్తించవచ్చు. అలాగే ఎమర్జెన్సీకి సంబంధించి లోక్ సభ, రాజ్యసభలో తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అయితే ప్రత్యేకంగా యుద్ధాన్ని ప్రకటించేందుకు ప్రత్యేకంగా ప్రక్రియ ఏమీ లేదు.

1971 సమయంలో యుద్ధం ఎలా స్టార్ట్ అయ్యింది..?

డిసెంబర్ 3, 1971న భారత వైమానిక స్థావరాలపై పాకిస్తాన్ ముందస్తు వైమానిక దాడులకు దిగింది. పాక్ చర్యల తర్వాత భారత్ అప్పట్లో ఇండో-పాక్ యుద్ధాన్ని ప్రకటించింది. పాకిస్తాన్ చేసిన దాడులను భారతదేశంపై యుద్ధ ప్రకటనగా అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రకటించారు. దీంతో రక్షణ చర్యల్లో భాగంగా భారత్ సైతం వైమానిక దాడులకు దిగింది. ఇందిరా గాంధీ ఈస్ట్ పాకిస్తాన్‌పై పూర్తి స్థాయి దండయాత్రకు ఆదేశించింది.

# ఉద్రిక్తతలు ముదురుతున్న వేళ తమ్ముడికి కీలక సలహా ఇచ్చిన నవాజ్ షరీఫ్



**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ పరిణామాల అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిన్న రాత్రి పాకిస్థాన్ వందలాది డ్రోన్లతో భారత్‌పై దాడికి పాల్పడటంతో ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పాక్ ప్రయోగించిన డ్రోన్లను భారత బలగాలు సమర్థవంతంగా కూల్చివేశాయి. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్... ప్రస్తుత ప్రధాని, తన సోదరుడు అయిన షెహబాజ్ షరీఫ్‌కు కీలకమైన సలహాలు అందించినట్లు తెలుస్తోంది. ఉద్రిక్తతలను తగ్గించడానికి దౌత్యపరమైన విధానాలను అనుసరించాలని ఆయన సూచించినట్లు 'ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్' ఒక కథనంలో వెల్లడించింది.

పహల్గామ్ ఉగ్రదాడి ఘటన, భారత్ సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో లండన్‌లో ఉన్న నవాజ్ షరీఫ్ ఇటీవలే పాకిస్తాన్ తిరిగివచ్చారు. అణ్వస్త్ర శక్తి కలిగిన ఇరు దేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను ఉపయోగించుకోవాలని ఆయన ప్రస్తుత ప్రధానికి సూచించినట్లు సమాచారం. గతంలో, 2023లో కూడా నవాజ్ షరీఫ్ మాట్లాడుతూ, భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. 1999లో కార్గిల్ యుద్ధాన్ని తాను వ్యతిరేకించినందువల్లే తన ప్రభుత్వాన్ని కూలదోశారని ఆయన ఆరోపించారు. 1999లో అప్పటి సైనిక పాలకుడు పర్వేజ్ ముషారఫ్ జరిపిన సైనిక తిరుగుబాటులో నవాజ్ షరీఫ్ ప్రభుత్వం కూలిపోయిన విషయం తెలిసిందే. తన ప్రభుత్వ హయాంలో, అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి శాంతి ఒప్పందం కుదుర్చుకోవడానికి లాహోర్ వచ్చారని, అయితే కార్గిల్ రూపంలో పాకిస్థాన్ ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని నవాజ్ గతంలో వ్యాఖ్యానించారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో ఆయన చేసిన తాజా సూచనలు ప్రాధాన్యతను సంతరించు కున్నాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగకుండా దౌత్యపరమైన చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన గట్టిగా సూచించినట్లు తెలుస్తోంది.